# ఆశ !... దోసెల్ !... అప్పడం

"ఎక్కడి కెల్తున్నావు వినోదా !"

ప్లాస్టిక్ సంచి పట్టుకుని బయలుదేరబోతున్న భార్యను ఎగాదిగా చూస్తూ అడిగాడు కైలాసం.

"ఈరోజు బంగాళ దుంపల పులుసు చెయ్యాలని నిన్ననే అర్డరేశారు గదా ! మీరు స్నానం చేసేలోగా నేను బజారుకెళ్లి బంగాళాదుంపలు కొనుక్కొస్తా" కలువ కళ్లను కమ్మగా తిప్పేసింది వినోదిని. నల్లని కనురెప్పలు తుమ్మెద రెక్కల్లా కదుల్తూంటే దొండపండు పెదాల మీద దానిమ్మ గింజల నవ్వు మెరిసింది. అది గుండెల్లో గుసగుసలు రేపింది.

"ఓహ్ ! అదా ! సరే, త్వరగా రావాలి" కొంగు అందుకోబోయాడు. మూతి తిప్పి "సరేగాని, నానిగాడు నిద్రలేస్తే టూత్ బ్రష్షూ, పేస్టు అందించండి." అంటూ గడప దాటి గబగబా అడుగులేసింది.

అప్పుడే ఏడున్నరైంది. పదింటికల్లా వంట కావాలి. పదిన్నరలోగా భర్త భోంచేసి ఆఫీసుకెళ్లాలి. నాలుగేళ్ల నానిగాన్ని తొమ్మిదికల్లా తయారు చేసి స్కూల్ రిక్షా ఎక్కించాలి... రోడ్డుమీది వినోదాలనేమీ గమనించకుండా ఆలోచనలతో పాటు అడుగులు ముందుకు పడుతున్నాయి.

ఝుంయ్... య్... ఎదురుగా హీరోహోండా బ్రహ్మరాక్షసిలా పరుగెత్తుకొస్తోంది. హీరోహోండా మీదున్న యువకుని ఎడమ చేతిలో, చెవి వద్ద సెల్‌ఫోన్... కుడి చేతిలో హాండిల్... దారి గమనించకుండా ఏదో మాట్లాడ్తున్నాడు. ఎటు చూస్తున్నాడో ఏమో గాని... ఇటే తన మీదికే దూసుకొస్తుందా హోండా. కలవరం, కల్లోలం. బుర్రలో భూచక్రం తిరిగింది.

"ఏయ్ ! ఆగు... ఆగాగు..." గొంతెత్తి హెచ్చరిస్తూ అమాంతం అటు గెంతింది.

"ఆ..హా.. హమ్మో... హా..మ్మో ..!" హీరో హోండా హీరో గావు కేకలు. తను తల అటు తిప్పుకుందో లేదో, ఇటు హీరో హోండా ఆటోరిక్షాను ఢీకొట్టింది. కన్ను మూసి తెరిచే లోగా హాహాకారాలు ఆకాశాన్నంటాయి.

బిలబిల మంటూ చుట్టూ జనాలు మూగారు.

"అరెరె... అయ్యో పాపం !" నిట్టూర్పులు, ఆటోముందు భాగం దెబ్బదిన్నది. ఆటో డ్రైవర్ రోడ్డు పక్కన పడిపోయాడు. ఆక్సిడెంటులో అదృష్టం... ఆటోలో డ్రైవర్ తప్ప మరెవ్వరూ లేరు. సెల్‌ఫోన్ ఆటోచక్రం క్రింద నలిగిపోయింది. హీరోహోండా హీరో ఆటోకు అడ్డంగా పడిపోయి మూలుగుతున్నాడు. హీరోహోండా బండి ఎగిరి అటు పక్క పడిపోయింది. హీరో మొహం జీరోలాగుంది. లేవలేక పోతున్నాడు. కొందరు జనాలు హీరోహోండాను లేపి నుంచో బెట్టారు. ఆటోను పక్కకు జరిపారు. మరికొందరు హోండా హీరోను లేపి నుంచోబెట్టబోయారు. "వామ్మో... నా కాలు... కుడికాలు...!" లబలబలాడాడు. రోడ్డుమీదనే కూచోబెట్టారు.

"అయ్యో... నా కాలు... వామ్మో నొప్పి" మూల్గుతున్నాడు.

అంతా గందరగోళం, "అయ్యో పాపం ! కుడికాలు విరిగిపోయింది" అంటూ ఆటో కింది కాలును పక్కకు జరిపాడొకాయన. హీరో అరుపులు దిక్కులనదర గొడుతున్నాయి. ఎవరో గోలీషోడా కొట్టి నోటి కందించారు. షోడా గటగటా తాగేసి "అవును ... నా కాలు విరిగింది బాబోయ్!" గొల్లుమన్నాడు హీరో.

వినోదిని పక్కన నుంచుంది. ఎదలో అలజడి... ఇది కలనా, నిజమా ! నిజమే... అబ్బో... నిజమే !

"అయినా... బండి నడుపుతూ సెల్‌ఫోన్ మాట్లాడితే డేంజరని తెల్వదా ?" చీత్కారం.

"అది ప్రమాదమని తెలిసినా అట్లే మాట్లాడ్తరు... నీయవ్వ."

"బాగా సదూకున్నోళ్లే గిట్ల అయితే ఎట్లా ?" ప్రౌఢ మహిళ బుగ్గలు నొక్కుకుంది.

"అరే... గదేం ఫేషనోగాని... బండి మీద ఉరుక్కుంట ఫోన్‌ల మాట్లాడితే పరేషాన్ గదా ! ఇంకానయం... ప్రాణం పోలేదు."

"పానం బోలేదు గాని కుడికాలు పుటుక్కుమంది గదా !" వ్యాఖ్యానాలు వెల్లువ లైనాయి.

ఎవరో వేడిచాయ తెచ్చి తాగించారు. "హమ్మయ్య !" అప్పుడే స్పృహలో కొచ్చినట్టు నిట్టూర్చాడు. అటూ ఇటూ అందర్నీ చూస్తున్నాడు.

"నీకేం పోయేకాలమొచ్చిందని గట్ల జేసినవయ్యా ! బండినో పక్కన ఆపుకొని మాట్లాడ్తే తప్పా !" నిలదీశాడొకాయన.

"వామ్మో మీకు దండం బెద్దా, ముందు నన్ను హాస్పిటల్‌కు తీస్కుపోండ్రయ్యా" హోండా హీరో దీనాలాపన. లోపలి పొంగునంతా గొంతులో అదిమిపెట్టినట్టుంది. మొహం మాడిపోయిన దోసెలాగుంది. చూపులు ఆటోకింద, కాలు పక్కన అప్పుడంలా నలిగిన సెల్‌ఫోన్ మీదున్నాయి.

అటూ ఇటూ ట్రాఫిక్ జామ్ ఐపోయింది. హారన్‌ల మోతలు, జనాల కూతలు... బలం పుంజుకుంటున్నాయి. "అరె... జెర జల్ది లేపుండ్రి" గుంపులోంచి కేక.

గుండె గుడగుడల్ని బిగపట్టుకుని, కొంగుతో నుదిటి చెమట వత్తుకుంటూ వినోదిని ఇంటికి చేరుకుంది. అప్పుడే స్నానాదులు ముగించుకుని ట్రిమ్‌గా డ్రెస్ చేసుకొని ఘుమ్మని బయటికొచ్చిన కైలాసం గతుక్కుమన్నాడు.

"బంగాళా దుంపలేవీ ?" ఖాళీ సంచి మీద కళ్లు నిలిచాయి. ఓ నిమిషమలాగే చూసి "అయితే మతిమరుపు మర్యాదలో ఖాళీ సంచి తిరిగొచ్చిందన్న మాటా !" నవ్వుతూ టీపాయ్ మీదున్న సెల్‌ఫోన్ తీసి జేబులో వేసుకోబోయాడు. చేతి బాంబు నెత్తిమీద పేలినట్టు... ఒక్క గంతులో ముందుకొచ్చి సెల్‌ఫోన్ లాక్కుంది వినోదిని. అప్పటికే గుండె లెగసి పడుతున్నాయి.

"మీరు స్కూటర్ మీదెల్తున్నారు గదా. దీన్ని వెంటతీసుకెళ్లేందుకు వీల్లేదు." సీరియస్‌గా హెచ్చరించింది. ముందుకొచ్చిన ముంగురులు నుదురు మీదాడు కుంటున్నాయి. నుదుటి మీది చెమట బొట్టు దాకా వస్తోంది.

"ఎందుకటా ?" కైలాసం నోరు కైలాస ముఖ ద్వారంలా తెరుచుకుంది. నుదిటి మీది చెమట బిందువుల్ని, వాటి మీద గంతులేస్తున్న ముంగురిల్ని కొనకొంగుతో సర్దుకుంటున్న వినోదిని కొత్తగా కనబడింది. అయినా అయోమయమే !

బజారులో తాను చూసిన దృశ్యాన్ని ఆసాంతం చెప్పేసి "అమ్మో... అమ్మో... బండి మీదెల్తూ సెల్‌ఫోన్‌లో ... వామ్మో... అదెంత డేంజరో !" అరచేతులంతైన కళ్లను అలాగే తిప్పుతూ గుండెలు బాదుకుంది.

"నేనిప్పుడు అర్జంటుగా నా ఫ్రెండు ఇంటికెళ్లిరావాలి. సెల్‌ఫోన్‌లో వానికేసు గురించి హైద్రాబాదు మిత్రునితో మాట్లాడాలి డియర్ !" సెల్‌ఫోన్ తిరిగి లాక్కోబోయాడు.

"నేనివ్వను !" తెగేసి చెప్పేసింది.

"మా ఫ్రెండు ఇంట్లో ఫోన్ లేదోయ్..." బతిమాలాడు.

"ఊహూం !" బుల్లి సెల్‌ఫోన్ జాకెట్లో దాగుంది.

"సరే ... బండిమీద ప్రయాణం చేసేప్పుడు సెల్‌ఫోన్ స్విచాఫ్ చేసి ఉంచుతా సరేనా !" బుగ్గమీద చిలిపిగా చిటికేశాడు. "కోపంలో నీ అందం వందరెట్లయింది సుమా!" చెంపలందుకుని ముందుకు లాక్కోబోయాడు.

అప్పుడే నానిగాడు గదిలోంచి బయటికొస్తున్నాడు. "చాల్లెండి సంబడం." భర్త కుడిచేతిని నానిగాడి నెత్తిమీదుంచింది. "వీని మీద ఒట్టేసి చెప్పండి" మరో చెయ్యి లాగి తన నెత్తిమీదుంచుకుంది.

ఒట్టేసి చటుక్కున నడుమందుకోబోయాడు. వినోదినిలోని ఆందోళన, అయోమయం మాయమైనాయి.

"అయ్యో ! ఆశ... దోశ... అప్పడం !" ఆవిడ ముఖారంవిందము వేయి రేకులుగా విచ్చుకుంది. కట్టుకున్న వాణ్ని పక్కకు నెట్టేసి కన్నవాణ్ని దగ్గరకు లాక్కుంది. "వచ్చేప్పుడు బంగాళా దుంపలు పట్రండి". ఖాళీ సంచి చేతికందించింది. స్విచాఫ్ చేసిన సెల్‌ఫోన్ భర్తకందిస్తూ మరోసారి సైగలతో వార్నింగిచ్చింది.

***(జలధి - 16-10-2004)***